## అంజన్నకు కార్తీక శోభ





కొండగట్టు అంజన్న సన్నిధి కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీక మాసం తొలి మంగళవారం కావడంతో హనుమాన్ భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు కొండగట్టుకు వచ్చి కోనేరులో స్నానం చేసి అంజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు రావి చెట్టు వద్ద పూజలు చేసి నెయ్యి దీపాలు వెలిగించారు.

శెనార్తి మీడియా, జగిత్యాల

# మానతావాది.. ఈ న్యాయవాది..

- 67 సార్లు రక్తదానం చేసిన బేతి
- అరుదైన 'ఓ' నెగెటివ్ రక్తదాత
- తాజాగా వృద్ధుడికి రక్తం ఇచ్చిన మహేందర్‌రెడ్డి
- రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండని పిలుపు




**శెనార్తి మీడియా, కరీంనగర్:**

నల్ల కోటు వేసుకొని, న్యాయాన్ని గెలిపించడమే కాదు.. ఎవరైనా ప్రాణాపాయ స్థితి ఉండి రక్తం కావాలని తెలిస్తే, క్షణం కూడా ఆగకుండా అక్కడి వెళ్లిపోతాడు. తనది అరుదైన 'ఓ' నెగెటివ్‌బ్లడ్‌కాగా, ఇప్పటి వరకు 67 సార్లు రక్తం దానం చేశాడు. 31 ఏండ్లుగా రక్తదానం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆయనే కరీంనగర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది, బీజేపీ సీనియర్‌నాయకుడు బేతి మహేందర్‌రెడ్డి.

**31 ఏండ్లుగా రక్తదానం..**

కరీంనగర్‌కు చెందిన బీజేపీ నేత, న్యాయవాది, బేతి మహేందర్ రెడ్డి 31 ఏండ్లుగా రక్తదానం చేస్తున్నారు. ప్రమాదకర పరిస్థితిల్లో అత్యంత అరుదైన "ఓ నెగటివ్" రక్తాన్ని 31 ఏళ్లుగా రక్తదానం చేస్తూ ఎందరివో ప్రాణాలు కాపాడారు. ఆయన ఇప్పటి వరకు సార్లు రక్తదానంతో పాటు ప్లేట్ లెట్స్, ప్లాస్మా దానం చేశారు. తాజాగా, జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన గుర్రం ఆగయ్య(70ఏండ్లు) తీవ్రమైన గుండె నొప్పితో బాధపడుతూ కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేరారు. ఆయనకు ఆపరేషన్‌అవసరమని, 'ఓ నెగెటివ్' బ్లడ్‌కావాలని డాక్టర్లు సూచించారు. ఈ విషయాన్ని ఓ నగరంలోని ఒక ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ ద్వారా పేషెంట్ బంధువులు బేతి మహేందర్ రెడ్డికి ఫోన్ ద్వారా సంప్రదించారు. ఆయన క్షణం ఆలస్యం చేయకుండా దవాఖానకు చేరుకున్నారు. 'ఓ నెగటివ్' రక్తాన్ని దానం చేసి ఆగయ్య ప్రాణాలు కాపాడారు. ఆయనకు రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ రక్తదానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలు కాపాడవచ్చని, నేటి వరకు తాను 67 సార్లు ఓ నెగెటివ్ రక్తాన్ని దానం చేశానని చెప్పారు. రక్తదానం చేయడం ద్వారా రోగి ప్రాణాలు కాపాడడంతో పాటు వారి కుటుంబాన్ని కూడా రక్షించినవారమవుతామని, అలాగే రక్తదానం చేయడం ద్వారా మనకు కొత్త రక్తం రావడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటామని, అందుకే ఎలాంటి భయాలు లేకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన బేతి మహేందర్ రెడ్డిని బీజేపీ శ్రేణులు, న్యాయవాదులు, 40వ డివిజన్ వాసులు, శ్రేయోభిలాషులు అభినందించారు



# కేంద్రమంత్రి బండిని కలిసిన నాయకులు

### గన్నేరువరం బ్రిడ్జి నిధుల విడుదలపై సాధన సమితి కృతజ్ఞతలు

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండలంలోని మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 77 కోట్ల రూపాయల నిధులు అధికారికంగా విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. ఈ సందర్భంగా మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహాశక్తి ఆలయంలో మానేరు బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు పుల్లెల జగన్‌మోహన్ ఆధ్వర్యంలో సమితి సభ్యులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్‌వర్మ, పుప్పాల రఘు, సాధన సమితి ప్రధాన కార్యదర్శి పుల్లెల రాము పాల్గొన్నారు. పుల్లెల జగన్‌మోహన్ మాట్లాడుతూ "గత 40 ఏళ్లుగా పరిష్కారం కాని గన్నేరువరం మండల ప్రజల చిరకాల కోరిక అయిన మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం సాధ్యమైంది. మండల అభివృద్ధి కోసం, ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని ఒప్పించి అనుమతులు సాధించి, తక్కువ కాలంలోనే నిధుల విడుదలకు కృషి చేసిన బండి సంజయ్‌కి గన్నేరువరం ప్రజలు రుణపడి ఉంటారు" అన్నారు. అలాగే, బ్రిడ్జిని చొక్కారావుపల్లి–ఖాజీపూర్ మధ్య కాకుండా గన్నేరువరం–ఎలగందుల మధ్య నిర్మిస్తే మండల ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుందని ఆయన సూచించారు.

# గునుకులకొండాపూర్‌లో ఉపాధి హామీ గ్రామసభ



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండల పరిధిలోని గునుకులకొండాపూర్ గ్రామంలో మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ సభను నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి లభించేలా కొత్త పనులను ఎంపిక చేసి, అంచనాలను సిద్ధం చేశారు. ఉపాధి హామీ కింద చేపట్టే పనుల్లో వ్యవసాయ పొలాలకు మట్టి రోడ్లు నిర్మాణం, అర్హత కలిగిన రైతులకు పశువుల పాకలు, గొర్రెల పాకలు, ఉద్యానవన మొక్కల పెంపకం, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, నాడెప్ కంపోస్ట్ పిట్‌ల నిర్మాణాలు వంటివి ఉండనున్నట్లు జీపీ కార్యదర్శి పి. రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో బెజ్జంకి ఏఎంసీ డైరెక్టర్ న్యాలపట్ల కనకయ్య గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ హన్మాండ్ల యాద గిరి, ఏఎన్ఎంలు పద్మ, మంగ, కారోబార్ ముల్కల అంజయ్య, గ్రామ పెద్దలు హనుమండ్ల నరసయ్య, న్యాలపట్ల రాజయ్య గౌడ్, రైతులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అందజేత




**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (CEIR) పోర్టల్‌లో అప్లోడ్ చేయగా, వాటిని గుర్తించి బాధితులకు తిరిగి అప్పగించారు. మంగళవారం కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో మిస్సింగ్ మొబైల్స్ అయిన చెంచాల శ్రీనివాస్, బుర్ర రవి, తోట అరవిందలకు వారి మొబైల్ ఫోన్లను తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై బీ సంపత్‌రెడ్డి మాట్లాడుతూ "ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే వాటి వివరాలను CEIR పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని, అలా చేస్తే పోగొగ్టుకున్న ఫోన్లు తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుంది" అని సూచించారు.

# క్రిప్టో కరెన్సీ మోసానికి డాక్టర్ బలి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



శ్రీనివాస్(ఫైల్)

కరీంనగర్ నగరంలో క్రిప్టో కరెన్సీ పెట్టుబడిలో మోసానికి గురై ప్రభుత్వ వైద్యుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. ప్రతిమ ఆసుపత్రిలో అనస్తీషియా (మత్తు) వైద్యుడిగా పని చేస్తున్న డాక్టర్ ఎం. శ్రీనివాస్ మత్తు ఇంజెక్షన్ తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంకమ్మతోటకు చెందిన శ్రీనివాస్ గతంలో చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా పని చేశాడు. ఆయన భార్య విప్లవశ్రీ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. తరచూ బ్యాంకు అధికారులు ఇంటికి రావడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నారని భార్య విప్లవశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్నేహితులతో కలిసి 'మెటా ఫండ్'లో పెట్టుబడి పెట్టిన శ్రీనివాస్, కరుణాకర్, కిరణ్, గణేష్ అనే స్నేహితులకు కోట్ల రూపాయల వరకు డబ్బులు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే వారు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పాటు బ్యాంక్ రుణాల చెల్లింపులపై ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్యకు దారితీసిందని కుటుంబసభ్యులు తెలిపారు. సుమారు మూడు కోట్ల రూపాయల వరకు అప్పులు పేరుకుపోయాయని, గత పదేళ్లుగా ఈఎంఐలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# విద్యార్థి దశ నుంచే సేవా స్ఫూర్తి అవసరం




- వాగ్దేవి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభం

**శెనార్తి మీడియా, బోథ్:**

సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవడం అత్యవసరమని వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజనాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బోథ్ మండలంలోని బాబేరతండా, కంటేగాం గ్రామాల్లో కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ప్రత్యేక శిబిరాలను ప్రారంభించారు. శిబిరాల ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రోగ్రామ్ అధికారులు, వలంటీర్లు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీగా గ్రామంలో తిరిగి, ఇంటింటికీ వెళ్లి సాధారణ ప్రజలకు ప్రాథమిక చట్టాలు, హక్కులపై వివరించారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించే ప్రచారాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం, ఆరోగ్యం, మట్టి నాణ్యతపై కలిగే దీర్ఘకాలిక ప్రభావాలను వివరించి, దానికి ప్రత్యామ్నాయాలు వాడాలని గ్రామస్తులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజనాల శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని, ఇటువంటి శిబిరాలు వారిలో మానవతా విలువలు, సేవా గుణాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజనాల శ్రీనివాస్, ప్రోగ్రామ్ అధికారులు బోనగిరి కార్తీక్, చట్ల సతీష్, సురేష్ తదితరులు, పెద్ద సంఖ్యలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

# కన్నాపూర్ పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

- ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశాడని గ్రామస్తుల ఆరోణ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇల్లు కల సాకారం చేసేందుకు ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు దశలో అవకతవకల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ నుంచి రూ.40 వేల చొప్పు న వసూలు చేశాడని బాధితులు ఆరోపించారు.ఈ మేరకు వారు ఎంపీడీవో కృష్ణ ప్రసాద్‌కి ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇచ్చినా ఇళ్ల మంజూరు జరగకపోవడంతో తాము మోసపోయామని, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ విషయంపై ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ఫిర్యాదు అందిందని, గ్రామసభ నిర్వహించి లబ్ధిదారుల నుంచి సమాచారం సేకరిస్తామని, కార్యదర్శి వసూలు చేసినట్లు తేలితే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం చేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ప్రభుత్వ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలి




**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**సహస్ర గళం, కరీంనగర్, అక్టోబర్ 28 :** ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఈనెల 27 నుండి వచ్చే నెల రెండు వరకు నిర్వహిస్తున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం అధికారులతో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవల్లో నిజాయితీ పెంపొందించాలని అన్నారు. ప్రజా సేవలో పారదర్శకత, బాధ్యత చాలా ముఖ్యమని తెలిపారు. ప్రతి ఉద్యోగికి పనిలో జవాబుదారీతనం ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ హెల్ప్ లైన్ నెంబర్ 14432, లోగో కు సంబంధించిన పోస్టర్ను విడుదల చేశారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఆర్డీవో మహేశ్వర్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సేవలు అందించడం అభినందనీయం

- కలెక్టర్ పమేలా సత్పతి
- స్వాతంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల పాఠశాల, వృత్తి విద్యా కేంద్రానికి కొత్త బస్సు ప్రారంభం

**శెనార్తి మీడియా, తిమ్మాపూర్ :**

దివ్యాంగులకు సేవలు అందించడం సమాజంలో మానవతా విలువలకు నిదర్శనమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ జిల్లా స్వాతంత్ర సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ లో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి విద్యా శిక్షణ కేంద్రానికి కొత్త బస్సును ప్రారంభించారు.

శ్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ 26 లక్షల రూపాయలతో ఈ బస్సును అందజేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి బస్సును ప్రారంభించి విద్యార్థులతో కలిసి ప్రయాణించారు. కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, మానసిక వికలాంగుల విద్యా, వృత్తిాభివృద్ధికి కృషి చేస్తున్న ట్రస్ట్ సభ్యుల సేవలు ప్రశంసనీయమని, దశాబ్దాలుగా నిరంతర సేవలు అందిస్తున్నారని తెలి పారు. ఉపాధ్యాయులు, సిబ్బంది కృషిని కూడా కొనియాడారు. ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం మానసిక వికలాంగుల పాఠశాలలో 130 మంది విద్యార్థులు చదువుతున్నారని, 40 మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ట్రస్ట్ ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 136 మందికి కంటి ఆపరేషన్లు చేయించామని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీనిధి ఫెడరేషన్ డీజీఎం సిహెచ్. వెంకటరెడ్డి, డైరెక్టర్ తిరుమల, ట్రస్ట్ వ్యవస్థాపకుడు బి. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించిన కలెక్టర్**

తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించి, ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు నాలుగు ఏ.ఎన్.సి. వైద్య పరీక్షలు తప్పనిసరిగా జరిగేలా చూడాలని, సాధారణ ప్రసవాల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్శనలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

**దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరం పరిశీలన**

ఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో, అలింకో సహకారంతో నిర్వహించిన సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. శిబిరానికి హాజరైన లబ్ధిదారుల వివరాలు, వైద్య పరీక్షల సమాచారం పక్కాగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.